ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
సోమవారం 11 ఆగస్టు 2025

అసౌకర్యాల నడుమ హంపి క్షేత్రం
• బురదలో పార్కింగ్‌పై పర్యాటకుల ఆగ్రహం

8

నకిలీ ధ్రువపత్రాల కేసులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది
• పోలీసుల అదుపులో నిందితుడు

జన నీరాజనం



ప్రధాని మోదీతో కలిసి మెట్రోలో ప్రయాణిస్తున్న సీఎం, డీసీఎం

ప్రధానితో కలిసి సీఎం, డీసీఎం సరదా ప్రయాణం

11ఏళ్లుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ బెంగళూరుతోపాటు కర్ణాటకకు ఎన్నో సార్లు సందర్శించారు. ఎన్నికల సభలే కాకుండా అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యులయ్యారు. గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు ప్రధాని వెంట సంపూర్ణంగా అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పైగా ప్రధానమంత్రిని స్వాగతించేందుకు ముఖ్యమంత్రి స్వయంగా హెచ్‌ఏఎల్ విమానాశ్రయానికి వెళ్లారు. కాన్వాయ్‌తోపాటు రాగిగుడ్డ మెట్రో స్టేషన్ నుంచి ఎలక్ట్రానిక్‌సిటీ దాకా ప్రధానికి చెరో వైపు సీఎం, డీసీఎంలు ఆశీనులయ్యారు. ప్రధానమంత్రి సరదాగా వేసిన జోకులకు ఇద్దరూ పడిపడి నవ్వారు. ఎలక్ట్రానిక్‌సిటీలో జరిగిన బహిరంగసభలో ప్రధానమంత్రికి డీసీఎం డీకే శివకుమార్ పక్క సీటులో కూర్చుని బెంగళూరు నగర అభివృద్ధికి సొరంగ మార్గాలు అవసరమని వివరించడంతోపాటు లక్షన్నర కోట్ల రూపాయల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందించాలని విన్నవించారు. సభ ముగిశాక కూడా ప్రధానికి సీఎం, డీసీఎం ఘనంగా వీడ్కోలు పలికారు. గతంలో ప్రధానమంత్రి రాష్ట్ర పర్యటనకు ప్రత్యేకించి బెంగళూరుకు వచ్చిన సందర్భంలోనూ ముఖ్యమంత్రి వెళ్లి స్వాగతించిన సందర్భాలు తక్కువే. అందులోనూ ప్రధానితో కలసి వేదికలు పంచుకోవడం కూడా కొన్నిసార్లు మాత్రమే. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సీఎం, డీసీఎంలు కలసి సంతోషంగా గడపడాన్ని ఇటు కాంగ్రెస్ వర్గాలే కాకుండా ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌లను కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. అభివృద్ధి విషయంలో రాజకీయాలతో సంబంధం లేకుండా సమన్వయంగా పని చేయాల్సి ఉంటుందని కొందరు మేధావులు అభిప్రాయపడ్డారు.



ప్రధానిని స్వాగతిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



గుజరాత్ తరహాలో సాయం చేయండి: సీఎం

గుజరాత్, మహారాష్ట్ర తరహాలో కర్ణాటకకు కూడా సాయం చేయాలని సీఎం సిద్దరామయ్య డిమాండ్ చేశారు. ప్రధాని సమక్షంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ముఖ్యమంత్రి మెట్రో ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర వాటా 50:50 నిష్పత్తిగా తీర్మానించారని, కానీ ప్రస్తుతం రాష్ట్రం 87.37 శాతం భరిస్తుండగా, కేంద్రం 12.63శాతం మాత్రమే సమకూరుస్తోందన్నారు. తద్వారా మెట్రో 1, 2, 2ఏ, 2బీ, మూడో స్టేజీలకు రాష్ట్రం 25,387 కోట్ల రూపాయలు సమకూర్చిందన్నారు. మెట్రో పనులకు మరింత సాయం చేయాలని కోరారు. బెంగళూరు ప్రపంచస్థాయి నగరంగా ఎదుగుతోందని అందుకు అవసరమైన మౌలిక వసతులకు ప్రత్యేక గ్రాంట్లు కేటాయించాలన్నారు.

• ప్రధాని మోదీకి బెంగళూరులో ఘన స్వాగతం
• 20 కిలోమీటర్ల మేర నమో నినాదాలే
• తొలిసారి స్వయంగా స్వాగతించిన సిద్దరామయ్య
• అన్ని కార్యక్రమాల్లోనూ పాల్గొన్న సీఎం, డీసీఎం
• ప్రధానితో కలిసి మెట్రోలో ప్రయాణం
• మూడు వందేభారత్ రైళ్లకు పచ్చజెండా
• ఎలక్ట్రానిక్ సిటీ మెట్రో జాతికి అంకితం

బెంగళూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలం తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారి బెంగళూరుకు విచ్చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా వరుస కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతిచోటా ప్రధానిని చూసేందుకు జనం బారులు తీరారు. ఉదయం 10.30 గంటలకు హెచ్‌ఏఎల్ విమానాశ్రయానికి చేరుకోగా గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లోట్, సీఎం సిద్దరామయ్యలు సాదరంగా స్వాగతించారు. ఇదే చోట బీజేపీ అగ్రనేత యడియూరప్ప, ప్రతిపక్షనేత అశోక్‌లు పుష్పగుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు. అక్కడనుంచి ప్రధానమంత్రి హెలికాప్టర్ ద్వారా మేఖ్రి సర్కిల్‌లోని ఎయిర్‌ఫోర్స్ హెడ్‌క్వార్టర్ ట్రైనింగ్‌సెంటర్‌కు వచ్చారు. అక్కడనుంచి రోడ్డు మార్గంలో ప్రధాని మోదీ పర్యటన ప్రారంభమైంది. రోడ్డుకు ఇరువైపులా ప్రజలు నిలబడి మోదీని చూసేందుకు ఎగబడ్డారు. మెజస్టిక్‌లోని క్రాంతివీర సంగొళ్ళి రాయణ్ణ రైల్వేస్టేషన్ (కేఎస్ ఆర్) కు చేరుకున్నారు. అక్కడ మూడు వందేభారత్ రైళ్లకు పచ్చజెండా చూపారు. అక్కడనుంచి నేరుగా చాళుక్య సర్కిల్, లాల్‌బాగ్ మెయిన్‌గేట్, వెస్ట్‌గేట్ మీదుగా సౌత్‌ఎండ్ సర్కిల్, జయనగర్, రాగిగుడ్డ మెట్రోస్టేషన్ దాకా రోడ్డు మార్గంగా వెళ్లగా దారిపొడవునా జనం కాన్వాయ్‌పై పూలు చల్లి స్వాగతించారు. నగరంలో సుమారు 20 కిలోమీటర్ల ప్రధానమంత్రి రోడ్డు మార్గంగా పర్యటించారు. పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా బందోబస్తు కల్పించారు. రాగిగుడ్డ నుంచి బొమ్మసంద్ర దాకా మెట్రోరైలు సేవలను జాతికి అంకితం చేశారు. అక్కడ నుంచే మెట్రో రైలులో ఎలక్ట్రానిక్‌సిటీదాకా ప్రయాణించారు. అక్కడ మెట్రో ఫేజ్3 పనులకు శ్రీకారం చుట్టి బహిరంగసభలో పాల్గొన్నారు. అక్కడనుంచి తిరిగి హెచ్‌ఏఎల్‌కు చేరుకోగా జోరు వర్షంలోనూ అధికారులు తదితరులు ప్రధానమంత్రికి ఘనంగా వీడ్కోలు పలికారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధాని



భద్రతా విధుల్లో పోలీస్ సిబ్బంది

బెంగళూరును కొనియాడిన ప్రధాని

కన్నడలో ప్రసంగాన్ని ప్రారంభించి నాడప్రభుకెంపేగౌడ కలలు సాకారమయ్యేలా బెంగళూరు అభివృద్ధి చెందిందని ఇక్కడి ప్రజలు అణ్ణమ్మదేవతను కొలుస్తారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభిప్రాయపడ్డారు. ఎల్లరిగూ నమస్కార అంటూ కేంద్రప్రభుత్వ సాధనలు, మేకిన్ ఇండియా ప్రాధాన్య ద్వారానే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందన్నారు. మన సైనికుల పరాక్రమం ప్రపంచమే చూసిందన్నారు. మేకిన్ ఇండియా ఆశయంతో ఆయుధాల దిగుమతి ప్రమాణం తగ్గించామన్నారు. పహల్గాంలో ఉగ్ర దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ కొనసాగించాలని నిర్ణయించామన్నారు. కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే పాకిస్థాన్ లోపలికి దూసుకెళ్లి ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయడం ద్వారా ప్రపంచానికి భారత విశ్వరూపం చూపిందన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయానికి బెంగళూరుతోపాటు ఇక్కడి యువ సాంకేతిక నిపుణుల సేవలు ఉన్నాయని కొనియాడారు. బెంగళూరు యువతకు సిందూర్ విజయానికి సంబంధించి ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలి సారి బెంగళూరుకు వచ్చానని, పాకిస్థాన్ ఉగ్రవాదులతో మన వీర సైనికుల పోరాటాన్ని ప్రపంచమే చూసిందన్నారు. సరిహద్దున ఉగ్రస్థావరాలు ధ్వంసం చేయడం ద్వారా దేశానికి కొత్త స్వరూపాన్ని తీసుకొచ్చామన్నారు. ఇదంతా సాంకేతికత, రక్షణ, మేకిన్ ఇండియా శక్తి సామర్థ్యాల సత్ఫలితమన్నారు. ఎల్లో మెట్రోలైన్ ప్రారంభించడం ద్వారా లక్షలాదిమంది ప్రజలకు అనుకూలం కానుందన్నారు. బెంగళూరులో కంపెనీలు ప్రపంచంతో పోటీ పడుతూనే రాష్ట్ర, దేశ కీర్తిని ఇనుమడింపచేస్తున్నాయన్నారు. మేకిన్ ఇండియా ఉత్పాదనలో బెంగళూరు, కర్ణాటక సేవలు అత్యధికమన్నారు. భారత్ అవసరాలు సమకూర్చేందుకు సమన్వయంగా పనిచేయాల్సి ఉందన్నారు. భారత్ అత్యున్నతస్థాయికి చేరాలంటే కేంద్రమైనా, రాష్ట్రమైనా మనమంతా ఒకే దేశం అనేది ముఖ్యమన్నారు. కేంద్రం తారతమ్యం చూపుతుందనే ఆరోపణలకు పరోక్షంగా తిప్పికొట్టారు. భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఐదోస్థానంలో ఉందని, మూడో స్థానానికి చేరాలంటే మరింత శ్రమ అవసరమన్నారు. 2014కు ఐదు నగరాలలో మెట్రో ఉండేదని, ఇప్పుడు 24 నగరాలకు విస్తరింపచేశామన్నారు. పదేళ్లకిందట రైల్వేలో 20వేల కిలోమీటర్లు విద్యుదీకరణ సాగగా ప్రస్తుతం 40వేల కిలోమీటర్లకు పెంచామన్నారు. 74 విమానాశ్రయాలను 160కు పెంచామని ఇదంతా మన సాధన అన్నారు. 7 ఎయిమ్స్, 321 మెడికల్ కళాశాలలు ఉండేవని, ప్రస్తుతం 22 ఎయిమ్స్‌లు, 704 మెడికల్ కళాశాలలకు పెరిగాయన్నారు. కేంద్రం అన్ని విధాలా గ్రాంట్లు ఇచ్చిందని, ఇందులో బేధాభిప్రాయం ప్రశ్న లేదన్నారు. కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ కర్ణాటకలో రైల్వేలో 9రెట్లు మౌలిక సదుపాయాలు పెరిగాయన్నారు. 2014కు ముందు కర్ణాటక వార్షిక సరాసరి 835 కోట్లు మాత్రమే ఉండేదని, 2025-26 7,564 కోట్లకు పెరిగిందన్నారు. బెళగావికి వందేభారత్ రైలు సుదీర్ఘకాలం డిమాండ్ అని సాధ్యం చేశామన్నారు.



ర్యాలీలో ఓ మహిళా అభిమాని ఉత్సాహం

బెంగళూరు అవసరాలు వివరించిన డీసీఎం డీకే



ఎలక్ట్రానిక్ సిటీలో జరిగిన బహిరంగసభలో సీఎం సిద్దరామయ్య ప్రసంగిస్తున్న సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పక్కసీటులో కూర్చుని బెంగళూరుకు అత్యవసరమైన అవసరాలను, ఇక్కడి సమస్యలను, చేపట్టదలిచిన ప్రాజెక్టులను డీసీఎం డీకే శివకుమార్ వివరించారు. ప్రధానంగా మౌలిక వసతులలో సొరంగమార్గాన్ని ప్రస్తావించారు. 1.50 లక్షలకోట్ల రూపాయలు బెంగళూరుకు స్పెషల్‌గ్రాంటుగా మంజూరు చేస్తే మరింత పురోగతి సాధ్యమని వివరించారు. ప్రధానమంత్రి వెంట కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్, కేంద్రమంత్రులు కుమారస్వామి, శోభాకరంద్లాజె, సోమణ్ణ, ఎంపీలు తేజస్వి సూర్య, డాక్టర్ మంజునాథ్, మంత్రి బైరతి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధానికి స్వాగతం పలుకుతున్న గవర్నర్, సీఎం, యడియూరప్ప

వందేభారత్ రైళ్లకు పచ్చజెండా

రాష్ట్ర రాజధాని బెంగళూరు దక్షిణభారత్‌లోని అన్ని రాష్ట్ర రాజధానులకు ఓ కీలకమైన ప్రాంతం. ఇప్పటికే దక్షిణాదిన అన్ని రాష్ట్రాల ప్రధాన నగరాలకు అనుబంధంగా బెంగళూరు నుంచి వందేభారత్ రైళ్లు ఉన్నాయి. రాష్ట్రానికి చివరన మహారాష్ట్ర, గోవాలకు సరిహద్దున సుదూరంగా ఉండే కుందానగరిగా పేరొందిన బెళగావికి వందేభారత్ రైలును ప్రధానమంత్రి నరేంద్రమోదీ లాంఛనంగా ఆవిష్కరించారు. ప్రతిరోజూ ఉదయం 5.20 గంటలకు బెళగావిలో బయల్దేరి మధ్యాహ్నం 1.50కు బెంగళూరుకు చేరుకోనుంది. తిరిగి 2.20 గంటలకు బెంగళూరు కేఎస్‌ఆర్ నుంచి బయల్దేరి రాత్రి 10.40 కు బెళగావికి వెళ్లనుంది. బెళగావి వందేభారత్‌తోపాటు నాగ్‌పూర్ - పూనెల మధ్య, అమృత్‌సర్ నుంచి శ్రీమాతావైష్ణోదేవిల మధ్య సంచరించే రెండు వందేభారత్ రైళ్లకు వర్చువల్ రూపంలో ప్రధాని శ్రీకారం చుట్టారు. ఏకకాలంలో మూడు వందేభారత్ రైళ్లకు పచ్చజెండా చూపినట్టయ్యింది. రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వేశాఖ సహాయ మంత్రి రాష్ట్రానికి చెందిన సోమణ్ణలతోపాటు సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. బెంగళూరులో బయల్దేరి బెళగావి వెళ్తున్న వందేభారత్ రైలుకు హావేరిలో మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై పచ్చజెండా చూపారు.



స్వాగతిస్తున్న కేరళ కళాకారులు



రాగిగుడ్డ మెట్రోస్టేషన్‌లోకి వస్తున్న ప్రధాని మోదీ

ఎలక్ట్రానిక్ సిటీ మెట్రో జాతికి అంకితం

జయనగర్ రాగిగుడ్డ నుంచి సిల్క్‌బోర్డు మీదుగా ఎలక్ట్రానిక్ సిటీ నుంచి బొమ్మసంద్ర దాకా నిర్మించిన మెట్రో ఎల్లోలైన్ సేవలను ప్రధానమంత్రి మోదీ జాతికి అంకితం చేశారు. ఎలక్ట్రానిక్‌సిటీ ప్రాంతంలో ఐటీ పరిశ్రమలు, బొమ్మసంద్ర నుంచి జిగణి దాకా వేలాది పరిశ్రమలు ఉన్నాయి. ఈ మార్గంలో ప్రతిరోజూ ఆరేడు లక్షలమంది మంది ఉద్యోగ, వ్యాపార, ఇతరత్రా వాటికి ప్రయాణిస్తుంటారు. వీరంతా ఉదయం, సాయంత్రం రోడ్డు ప్రయాణం చేయడం వల్ల ప్రతిరోజూ ఈ మార్గం ట్రాఫిక్‌తోనే కొనసాగుతుంది. ఈ మార్గంలో మెట్రో నిర్మాణాలకు ఇన్ఫోసిస్ ఐటీ కంపెనీ కోట్లాది రూపాయలు విరాళంగా ఇచ్చింది. అందుకే ఇన్ఫోసిస్ కోనప్పన అగ్రహారగా మెట్రోస్టేషన్‌కు పేరు పెట్టారు. ప్రధానమంత్రి మెట్రోసేవలకు పచ్చజెండా చూపారు. మెట్రోలో సుమారు 16మంది విద్యార్థులతో ప్రధానమంత్రి ముచ్చటించారు. వారి అభిప్రాయాలు, నగరం గురించి, వారికి ఇష్టమైన సబ్జెక్టులు, ఇష్టంలేని సబ్జెక్టుల కారణాలను అడిగి తెలుసుకున్నారు. జియోగ్రఫీ అంటే నాకు ఇష్టంలేదని ఆ పీరియడ్‌లో నిద్ర వచ్చేదని, కొన్నేళ్లనాటి స్మృతులను స్మరించుకున్నారు. భవిష్యత్తులో మీరు ఏం కాదలచుకున్నారని అడుగుతూనే బాధ్యతగా నైతిక విలువలు పాటించాలని విద్యార్థులకు హితవు పలికారు. 8మంది మెట్రో కార్మికులతోనూ ముచ్చటించారు. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ విషయాన్ని అధికారుల నుంచి ప్రధాని ఆరా తీసినట్టు సమాచారం. ఎలక్ట్రానిక్‌సిటీకి చేరుకున్నారు. నమ్మమెట్రో ఫేజ్3 పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. జేపీనగర్ 4వ ఫేజ్‌లోని కెంపాపుర నుంచి అవుటర్ రింగ్‌రోడ్డు దాకా 32.15 కిలోమీటర్ల నిర్మాణం, మాగడి రోడ్డు హొసహళ్ళి మెట్రో స్టేషన్ నుంచి కడబగెరె దాకా 12.5 కిలోమీటర్ల ఆరెంజ్ లైన్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

నేటి నుంచి శాసనసభ సమావేశాలు



శాసనసభలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పీకర్ యూటీ ఖాదర్

బెంగళూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): శాసనసభ వర్షాకాల సమావేశాలకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి ఈనెల 22వరకు 9రోజులపాటు కలాపాలు సాగనున్నాయి. బడ్జెట్ సమావేశాల తర్వాత కలాపాలు ప్రారంభమవుతుండగా అధికార, ప్రతిపక్ష పార్టీలు శాసనసభలో పలు అంశాలను లేవనెత్తేందుకు సిద్ధమయ్యాయి. ధర్మస్థళ వివాదం, ఓట్ల చౌర్యంతోపాటు కీలకమైన అంశాలను సభలో ప్రస్తావించేందుకు ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌లు సన్నద్ధమయ్యాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మహదేవపురలో ఓట్లచౌర్యాన్ని ప్రస్తావిస్తూ ఫ్రీడంపార్కులో భారీ నిరసన చేపట్టారు. అదే రోజున మహదేవపుర నియోజకవర్గం సుదీర్ఘకాలం శాసనసభ్యుడిగా కొనసాగిన అరవింద లింబావళి ఆరోపణలకు సంబంధించి ప్రతి అంశాన్ని తిప్పికొట్టారు. ప్రస్తుతం ఆయన భార్య ఎమ్మెల్యేగా ఉన్నారు. నియోజకవర్గంలో ఓట్లకు సంబంధించి ఎటువంటి అక్రమాలు చోటు చేసుకోలేదని తేల్చి చెప్పారు. మరోవైపు రాహుల్‌గాంధీకి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆరోపణలకు సంబంధించిన రికార్డులను సమర్పించాలని నోటీసు ఇచ్చింది. ఇలా సాగుతుండగానే సహకారశాఖ మంత్రి రాజణ్ణ వ్యాఖ్యలు కాంగ్రెస్‌పార్టీని డోలాయమానంలో పడేశాయి. 2023 తర్వాత రాష్ట్రంలో మన ప్రభుత్వమే ఉందన్న అంశం కాంగ్రెస్ నాయకులకు మంత్రులకు షాక్ ఇచ్చింది. ఈ అంశంపై పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. వీటన్నింటికంటే ధర్మస్థళ వివాదంపై తీవ్రస్థాయిలో పట్టుబట్టాలని బీజేపీ భావిస్తోంది. ఆదివారం శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ విధానసౌధను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సోమవారం నుంచి శాసనసభ కలాపాలు అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్యుద్ధానికి వేదిక కానుంది.




విధానసౌధను శుభ్రపరుస్తున్న సిబ్బంది

ఏడాదైనా మోక్షం లేదు..!

• టీబీ డ్యామ్ క్రస్ట్‌గేటు కొట్టుకుపోయి సంవత్సరం పూర్తి
• స్టాప్‌లాగ్‌తోనే కొనసాగింపు • శాశ్వత చర్యలపై యంత్రాంగం నిర్లక్ష్యం

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) తుంగభద్ర జలాశయం 19వ క్రస్ట్‌గేట్ గేట్ కొట్టుకోపోయి ఏడాది పూర్తయ్యింది. సరిగ్గా ఆగస్టు 10, 2024 వ తేదీన అర్ధరాత్రి వరద నీటిలో గేటు కొట్టుకుపోయింది. అప్పట్లో జలాశయంలో నీటి నిలువ చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన 19వ క్రస్ట్ స్థానంలో తాత్కాలికంగా స్టాప్‌లాగ్ ఏర్పాటు చేశారు. అయితే ఏడాది గడిచినా ఇంతవరకు శాశ్వత గేటు ఏర్పాటు చేయడంలో బోర్డు అధికారులు విఫలమయ్యారు. జలాశయం 7 దశాబ్దాల క్రితం నిర్మించినది కావడంతో అప్పట్లో ఏర్పాటు చేసిన క్రస్ట్‌గేట్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, జలాశయానికి ఉన్న 33 క్రస్ట్‌గేట్లు మార్చాలని నిపుణుల నివేదికలు అందించిన సంగతి తెలిసిందే. అయినా గేట్ల మార్పునకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ఏడాది మొదట్లో 32 క్రస్ట్ గేట్లను మార్చేందుకు టెండరు ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు గేట్ల అమరికలో ఇంతవరకు ఒక అడుగు కూడా ముందుకు వేయలేదు. నిపుణుల సూచలన మేరకు జలాశయంలో నీటి నిల్వను ఈ ఏడాది 80 టీఎంసీలకు పరిమితం చేయాలని సూచించిన సంగతి తెలిసిందే. దీంతో 80టీఎంసీల నీటిని చేరగానే డ్యామ్ గేట్లు తెరిచి కాల్వలకు నీరు వదిలారు. గత రెండు నెలలుగా నదికి నీటి విడుదల కొనసాగుతోంది. ఈ సారి వర్షాలు ఎక్కువగా కురిసినా జలాశయంలో పూర్తి స్థాయిలో నీటిని నిలుపుకోలేక పోవడం పట్ల రైతులు బోర్డు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రెండో పంటకు సాగునీటి కొరత తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గేట్లు పూర్తిగా మార్చేసి నీటి నిల్వను పెంచాలని రైతులు కోరుతున్నారు.



కొట్టుకుపోయిన క్రస్ట్ గేట్ (ఫైల్)

రాహుల్ గాంధీకి మోకాలిలో మెదడు

• ఎమ్మెల్యే బసనగౌడపాటిల్ యత్నాళ్ ఎద్దేవా



బెంగళూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఓట్ల చౌర్యంపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలపై విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాహుల్‌గాంధీ ఓ పెద్ద బచ్చా అని... అందరికీ తలలో మెదడు ఉంటే రాహుల్‌కు మోకాలిలో ఉందని ఎద్దేవా చేశారు. బాగల్కోటెలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన రాహుల్‌గాంధీ ముత్తాత నెహ్రూ ప్రధాని ఎలా అయ్యారంటే... 15 రాష్ట్రాల్లో 14 రాష్ట్రాలు సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు మద్దతు ఇచ్చారని, ఒకేఒక్క రాష్ట్రం నెహ్రూకు మద్దతు ఇచ్చిందన్నారు. అయినా అప్పటి పరిణామాలతో ప్రధానిగా నెహ్రూ అయ్యారన్నారు. ఇందిరాగాంధీ కూడా రాజ్‌నారాయణ్‌కు వ్యతిరేకంగా బోగస్ ఓటింగ్ చేసినందుకు అలహాబాద్ హైకోర్టులో తీర్పు వచ్చిందన్నారు. బాదామి ఎన్నికల్లో సీఎం సిద్దరామయ్య విజయానికి 3వేల ఓట్లు కొన్నామని ఆయనకు అత్యంత మిత్రుడు ఇబ్రహీం చెప్పారన్నారు. మరో రెండేళ్లు ఆగితే జమీర్ అహ్మద్‌ఖాన్ కూడా చెబుతారని, రాజకీయాల్లో డబ్బు లేకుంటే ఎవరూ గెలవలేరన్నారు. బీజేపీలో మరోసారి చేరే విషయమై తాను ఎవరితోనూ మాట్లాడలేదని, ప్రశాంతంగా ఉన్నానన్నారు. తన అవసరం పార్టీకి ఉంటే వారే తీసుకుంటారన్నారు. కాగా విజయేంద్రను మరోసారి బీజేపీ అధ్యక్షుడిగా కొనసాగిస్తే జేజేలు కొట్టేందుకు ఆ పార్టీకి వెళ్లాలా.. అంటూ మండిపడ్డారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

రాయచూరు, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని యరగేరా గ్రామం వద్ద ఆదివారం మధ్యాహ్నం పిడుగు పాటుకు గురై మహిళ ఒకరు మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన నాగరాజు నాయక్ భార్య భవాని(26) పొలం పనుల కోసం వెళ్లింది. పొలంలో పనిచేస్తుండగా చిన్నగా వర్షం మొదలైంది. అకస్మాత్తుగా కురిసిన వర్షానికి తోడు పిడుగు కూడా పడడంతో తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృత్యువాత పడింది.

విద్యార్థుల తరలింపుపై నిషేధం

7

• సభలు, సమావేశాలకు ప్రేక్షకులుగా అనుమతించేది లేదు
• పాఠశాలలపై చర్యలకు సిద్ధం
• రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,633.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	38,772	40,925
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	38,618	28,133
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	105.79



ఊడిపడిన పెచ్చులు, భవనం పైకప్పు

పెచ్చులూడిన అంగన్‌వాడీ భవనం పైకప్పు

కంప్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రం పైకప్పు కూలినా పిల్లలు ఎవ్వరూ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. హగరి బొమ్మన హళ్లి పట్టణంలో శనివారం సాయంత్రం 6వ వార్డు లోని 4వ అంగన్ వాడీ కేంద్రం భవనంపైకప్పు కూలింది. చిన్నారులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. గత కొన్ని సంవత్సరాలుగా భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు ఇనుప కడ్డీలు తుప్పు పట్టి బయటకు వచ్చాయి. గోడలు, పైకప్పు దూలాలు కూడా పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ గందరగోళం కారణంగా పిల్లలకు భద్రత లేకపోవడంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండేవారు. ఎన్నో సార్లు విషయం పైన ఏ అధికారులు తెలిపినట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు నూతన అంగన్ వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జోరు వాన



వర్షంతో తడిసిన రహదారి

సిరుగుప్ప, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తాలుకా వ్యాప్తంగా రెండు రోజుల నుంచి వర్షం ఎడతెరపి లేకుండా కురుస్తోంది. పట్టణంతో పాటు సమీప గ్రామాల్లో జోరు వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు బురదమయంగా మారాయి. ఎక్కడ చూసినా వరదనీరు నిలిచిపోయింది. భారీ వర్షాలతో తుంగభద్ర నది, హగరి నదులు పొంగి పొర్లుతున్నాయి.

తెరుచుకున్న నారీహళ్ల జలాశయం గేట్లు

కంప్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నారీహళ్ల జలాశయం నుంచి 2900 క్యూసెక్కుల నీరు వాగుకు నాలుగు గేట్ల ద్వారా నీటిని అధికారులు విడుదల చేశారు. తాలుకాలోని తారానగర్ గ్రామశివార్లలో ఉన్న నారీహళ్ల జలాశయంలోకి చుట్టుపక్కల గ్రామాలలో నుండి వర్షం కారణంగా భారీ నీరు జలాశయంలోకి చేరుతున్నాయి. రుతుపవనాలు భారీ వర్షాల కారణంగా జలాశయం వరుసగా మూడవ సారి నిండింది. యేడాది జలాశయం నుండి వాగుకు మూడో సారి నీటిని విడుదల చేశామని తెలిపారు.



వాగులోకి వస్తున్న నీరు

అసౌకర్యాల నడుమ హంపి క్షేత్రం

● బురదమయమైన పార్కింగ్ స్థలంతో పర్యాటకులకు ఇబ్బందులు



విజయ విఠల దేవస్థానం వద్ద బురదలోనే పార్కింగ్

బళ్లారి సిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): హంపి పర్యాటకులకు అసౌకర్యాలు ఇబ్బంది కలిగిస్తున్నాయి. విజయవిఠల ఆలయాన్ని, రాతి రథాన్ని చూడటానికి వచ్చిన వారికి తలవరఘాట్ వద్ద పార్కింగ్ స్థలం పీడకలగా మారే ప్రమాదం ఉంది. వర్షం పడినప్పుడల్లా ఈ పార్కింగ్ స్థలం బురదమయంగా మారి ఇబ్బంది కలిగిస్తోంది. పర్యాటకులు ఇక్కడ తమ వాహనాలను పార్కింగ్ చేయాలంటే ఇబ్బంది పడాల్సివస్తోంది. ఇటీవల వర్షాలతో ఈ ప్రాంతం బురదమయంగా మారింది. శుక్రవారం, శనివారం రాత్రి మళ్ళీ వర్షం కురవడంతో పర్యాటకులకు ఇబ్బంది తప్పడం లేదు. విజయ విఠల ఆలయానికి వెళ్ళే దారి గోతులమయంగా మారింది. ఈ బురదలో బ్యాటరీ వాహనాలు ఎలా తిరుగుతాయని డ్రైవర్లు వాపోతున్నారు. వీటన్నిటికీ భారత పురావస్తు సర్వే(ఏఎస్ఐ) నిర్లక్ష్యమే కారణమని వారు విమర్శిస్తున్నారు. శౌచాలయాలు కూడా సరిగా నిర్వహించడం లేదు. తాగునీటి వ్యవస్థ ఏర్పాటు లేదు. తాత్కాలిక వాహనాల్లో వాటర్ బాటిళ్ళు నిల్వ చేయడానికి కూడా అనుమతి లేదని చాలా మంది పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయ విఠల ఆలయ దక్షిణ గోపురం ఇటుకలు పడిపోయి శిథిలం అయ్యింది. పురావస్తు శాఖ నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతోంది. కొద్ది రోజులుగా గోపురం గేటు కూడా మూసివేశారు. రాతి రథం, సంగీత మందిరాన్ని సందర్శించాల్సిన పర్యాటకులు తూర్పుగేటు నుంచి రావాల్సి వస్తోంది. పార్కింగ్ స్థలంలో ఉన్న సమస్యలను పరిశీలిస్తామని ఏఎస్ఐ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి తెలిపారు.



మూసేసిన దక్షిణ ద్వారం

ఘనంగా హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

హొస్పేట,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాన్ని పురష్కరించుకుని నగరంలో ఆదివారం హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీనిర్వహించారు. బీజేపీ జిల్లా,మండల నాయకులు వరకరాయ దేవాలయంలో దేవతకు పూజలు చేసి నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించారు. పడకట్టె ఆంజనేయ, మూరంగడి సర్కిల్,పుణ్యమూర్తి సర్కిల్, బస్టాండ్, పునీత్‌రాజ్‌కుమార్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయం మీదుగా బీజేపీ కార్యాలయంకు చేరుకుంది. ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్ సింగ్ కుమారుడు సిద్ధార్థ సింగ్ పుట్టిన రోజు కూడా జరుపుకున్నారు.ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎస్ రామవేంద్ర, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అయ్యలి తిమ్మప్ప, మండల అధ్యక్షుడు శంకర్ మేటి, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు కిచిడి కొట్రేశ్, నగర అధ్యక్షుడు రేవణ సిద్దప్ప, హెచ్ రాఘవేంద్ర, చంద్రుదేవలాపూర్, గౌలి బసవరాజ్, హోన్నూరప్ప, ఉమ, జయశ్రీ, అణ్ణద పాల్గొన్నారు.

అగ్ని వీర్ ర్యాలీకి మూడోరోజు 738 మంది



దేహదారుఢ్య పరీక్షల కోసం క్యూలో నిలిచిన అభ్యర్థులు

రాయచూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో చేపట్టిన అగ్ని వీర్ నియామక ర్యాలీకి మూడోరోజు ఆదివారం 738 మంది అభ్యర్థులు హాజరైయ్యారు. మొత్త 860 మంది తమ పేర్లను రిజిస్టర్ చేసుకోగా హాజరైన వారు 738 మందిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో 451 మందికి 1600 మీటర్ల రన్నింగ్ రేస్‌లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. 11వ తేదీ నిర్వహించే ఎంపిక ప్రక్రియకు 860 మంది పేర్లు రిజిస్టర్ చేసుకోగా వీరంతా బెళగావి జిల్లాకు చెందిన అభ్యర్థులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



అలంకరణలో హనుమంతుడు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంప్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కురుగోడు తాలుకా పరిధిలోని సిద్ధమ్మనహళ్లి గ్రామంలో శ్రావణమాసం పురస్కరించుకుని గ్రామంలో సాయంత్రం ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఒక రోజు ముందుగానే పల్లకితో మారుతిక్యాంపు చేరుకుని అక్కడ ఆంజనేయస్వామి ఆలయంలో భజనలు చేపట్టి తిరిగి సాయంత్రం వేళ సిద్ధమ్మనహళ్లి పల్లకితో చేరుకుని అక్కడ ఆంజనేయస్వామి రథోత్సవం ఆలయం మొదలుకొని ఎదురు బసవన్న కట్ట వరకు రథోత్సవాన్ని ఊరేగించారు. ఈ రథోత్సవం కార్యక్రమంలో కురుగోడు, కుడితిని, కంప్లి తాలుకాలలో పరిధిలోని భక్తాదులు స్వామివారికి పూలు, పండ్లతో మొక్కులు సమర్పించుకుని పూజలు చేపట్టుకున్నారు. ఈ రథోత్సవ పండుగను గ్రామంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఈ వేడుకల్ని జరుపుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కంప్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : రాఘవేంద్రస్వామి ఆరాధన సందర్భంగా కంప్లి పట్టణంలో ఎండీ క్యాంపులోని వెలిసిన రాఘవేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆది, సోమ, మంగళ మూడు రోజులు పాటు రాఘవేంద్రస్వామి బృందావన్‌కి ప్రత్యేకాలంకరణ చేపట్టి ఈ ఆరాధన మహోత్సవాలు జరుపుకుంటున్నట్లు ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. ఆదివారం పండ్లతో స్వామివారి బృందావన్‌కి అలంకరణ చేపట్టి పూజలు చేపట్టుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ ప్రత్యేక కార్యక్రమాలు ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరుపబడతాయని తెలిపారు. మూడు రోజులపాటు ఆలయంలో భక్తులకు అన్నదానాలు జరుగుతున్నట్లు తెలిపారు.



అలంకరణలో బృందావనం

దర్గా ఉత్సవాలు ప్రారంభం



ముస్తాబైన దర్గా

రాయచూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో వెలసిన చారిత్రక శమ్స్ ఎ ఆలం దర్గా ఉత్సవాలు శనివారం రాత్రి నుంచి అంగరంగా వైభవంగా ప్రారంభమైయ్యాయి. శనివారం రాత్రి గంధోత్సవం నిర్వహించగా ఆదివారం మధ్యహ్నాం నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలకు నగరంతో పాటు జిల్లాలోను ఇతర రాష్ర్టాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడం ఆనవాయితి.



గంధోత్సవం నిర్వహిస్తున్న మతపెద్దలు

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



అలంకరణలో సత్యానారాయణ పేట రాఘవేంద్ర స్వామి ఆలయం

బళ్లారి సిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పీఠాధిపతి రాఘవేంద్ర తీర్థ గురు సార్వభౌముడి 354వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముందస్తు పూజలసందర్భంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. నగరంలోని సత్యానారయణపేటలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో కనకాభిషేకం నిర్వహించారు. ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కన్నడ సాహిత్యానికి ప్రపంచ ఖ్యాతి

● కవయిత్రి సవితా నాగభూషణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కవయిత్రి సవితా నాగభూషణ

బళ్లారి సిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్యం ప్రపంచ సాహిత్యంతో సమానమని, దీనికి అన్నీ ఇచ్చే శక్తి ఉందని కవయిత్రి సవితా నాగభూషణ అభిప్రాయపడ్డారు. బెంగళూరులోని బెసగరల్లి రామన్న ఫౌండేషన్ ,సిటీ లోహియా ప్రకాషన్ ఆదివారం నగరంలోని బిపీఎస్‌సీ పాఠశాల్లో నిర్వహించిన డాక్టర్ రాజశేఖర్ నీరమాన్వి స్మారక కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆమె మాట్లాడారు. వినూత్న కథలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయని రాజశేఖర్ నీరమాన్వి కాలంలోని కథలన్నీ ప్రపంచానికి పరిచయం చేయడం విలువైనవని ఆమె అన్నారు. నీరమాన్వి కథల పుస్తకాల్లో ఓ వ్యక్తి యొక్క పోరాటాలు, అతనిగుర్తింపు, సమాజం అతన్ని ఎలా చూస్తుంది వంటి అంశాల ద్వారా అధ్యాత్మికతను చిత్రీకరించినట్లు అనిపిస్తుందన్నారు. లోహియ ప్రకాశన్‌కు చెందిన సుజాత మాట్లాడుతూ చెన్నబసప్ప, బెసగరల్లి రామన్న, రాజశేఖర్ నీరమాన్వి , అద్వానీ వీరభద్ర రచనలను ప్రచురించింది. సాహిత్యంలో అనేక రచనలు నిర్వహించబడుతాయన్నారు. ఈసందర్భంగా బసవరాజేశ్వరీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ప్రెసిడెంట్ మహిపాల్, దస్తగిరి సాబ్, శివలింగప్ప హండ్యాల్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా హగరి-బళ్లారి రోడ్డు

బళ్లారిరూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని హగరి బళ్లారి రోడ్డు పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోతులమయంగా తయార య్యింది. అమరాపురం బేవనహళ్లి, బీసనహళ్లి సమీపంలో వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తు న్నాయి. దీంతో రోడ్డు బాగా దెబ్బ తినింది. దీంతో రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారి కానరాక కిందపడి తరచూ ప్రమాదానికి గురవుతున్నారు. ఎన్‌హెచ్ అధికారులు వీలైనంత త్వరలో గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గోతులమయమైన రహదారి

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం



ధ్వంసమైన మొక్కజొన్న పంట

కంప్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కూడ్లిగి తాలుకాలోని కనమడుగు గ్రామంలో రైతులు వేసుకున్న మొక్కజొన్న పంటలను అడవి జంతువులు ఎలుగుబంటి, అడవి పందులు వల్ల మొక్కజొన్న పంటలో పూర్తిగా నాశనం అవుతున్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ప్రతి నిత్యం రాత్రివేళల్లో మందలు మందలుగా మొక్కజొన్న పంటలపై దాడి చేసి పూర్తిగా నాశనం చేస్తున్నాయని తెలుపుతున్నారు. కూడ్లిగి సరిహద్దు, దావణగేరి జిల్లా మొదలుకొని అనుబనూరు అడవుల్లో నుండి ఎక్కువ పొలాల్లో ఒక దాడి చేస్తున్నాయని రైతు పక్కీరప్ప తెలిపారు. తాము వేసుకున్న ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటలో అడవిపందులు ఎలుగుబంట్లు దాడి చేసి పంటలను పూర్తిగా నాశనం చేశాయని తెలుపుతున్నారు. వెంటనే అటు శాఖ అధికారులు చర్యలు తీసుకుని కొండ ప్రాంతంలో విద్యుత్ లైట్లను, కంచె ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

పొంగిపొర్లుతున్న వాగులు

● కొట్టుకుపోయిన టణమనకల్ వంతెన
● ఉధృతంగా ప్రవహిస్తున్న గణేకల్ వాగు



టణమనకల్ వద్ద తాళ్ల సహాయంతో వంతెన దాటుతున్న రైతులు

రాయచూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గడచిన నాల్గు రోజులుగా జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల అనేక గ్రామాల వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాల ప్రజలకు రాకపోకలకు సమస్యగా మారింది. జిల్లాలో హట్టి బంగారు గనిలోని టణమనకల్ గ్రామ హిరేహళ్ళ వాగు పొంగి ప్రవహిస్తున్నది. దీంతో టణమనకల్ నుంచి కృష్ణా నది వరకు వెళ్లె రోడ్డు పై ఏర్పాటు చేసిన వంతెన ఒకటి వర్షానికి కొట్టుకుపోగా వంతెన దాటి అవతల వైపు గొర్లు, పశువులను మేపేందుకు వెళ్లిన వారు తిరిగి వచ్చేందుకు నానా అవసక్తలు పడాల్సి వచ్చింది. శనివారం సాయంత్రం ఒక్కసారిగా హిరేహళ్ళ వాగు పొంగి వంతెన కొట్టుకుపోగా అప్పటికే అప్పటికే ఆవులవైపుకు వెళ్లిన రైతులు, గొర్ల కాపర్లు, పశువులు వాగు దాటేందుకు ఇతరుల సహాయంతో తాళ్లు ఇతరత్ర వాటి సహాయంతో దాటాల్సిన పరిస్థితి తలెత్తింది.

గబ్బూరులో:-జిల్లాలో గబ్బూరు నుంచి సిరవార రోడ్డు మార్గ మధ్యలో ఏర్పాటు చేసిన గణేకల్ వాగు పై పెద్ద ఎత్తున వర్షపు నీరు వచ్చి చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గబ్బూరు నుంచి సిరవారకు వెళ్లె ప్రధాన రోడ్డు మధ్యలో ఉన్న గణేకల్ వాగు ఒకటి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఈ మార్గంలో వెళ్లె వాహనదారులు రైతులు, కూలీలు, విద్యార్థులు గంటల తరబడి వాగు వద్ద వేచి ఉండే పరిస్థితి తలెత్తింది.

హోసూరు జోన్



స్వాగతం పలుకుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

రాజీవ్ జ్యోతియాత్రకు స్వాగతం

హోసూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నేపథ్యంలో రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్ర పెరంబుదూర్‌లో ప్రారంభమైంది. శనివారం రాత్రి హోసూరుకు చేరుకోగా ఐఎన్‌టీయూసీ నాయకులు స్వాగతించారు. టీవీఎస్ మోటారు కంపెనీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కుప్పుస్వామి మార్గదర్శకత్వంలో టీవీఎస్ మోటార్ కంపెనీ ఉద్యోగుల సంఘం తరపున స్వాగతం పలికారు. 36వ వార్డు కౌన్సిలర్ పాకియలక్ష్మి అన్నాదురై, కార్యనిర్వాహక అధ్యక్షుడు మున్రాజ్, కార్యదర్శి సెందిల్‌కుమార్, వైస్‌చైర్మన్ కణ్ణన్, జాయింట్ సెక్రటరీ రాజా, రాఘవేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పాదయాత్ర

రాయచూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వినూత్న రీతిలో నిరసన చేపడుతామని జిల్లా ప్రైవేటు విద్యసంస్థల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి నాగరాజు మస్కి తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్య సంస్థల రెన్యూవల్ మొదలుకొని ప్రభుత్వం విధిస్తున్న అనేక నిబంధనలు తమకు ఇబ్బందికరంగా మారాయన్నారు. ఈ క్రమంలో సమస్యల పరిష్కారం కోసం అనేక సార్లు ప్రభుత్వానికి అధికారులకు విన్నవించినా ఇప్పటి వరకు స్పందన లేదన్నారు. దీంతో విధి లేకా ఈనెల 12న జిల్లా కేంద్రంలో సమావేశమై పాదయాత్ర ద్వార పాత జిల్లాధికారి కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపడుతామన్నారు. 12వ తేదీ ఉదయం స్థానిక గాంధీసర్కిల్ వద్ద సమావేశమై అక్కడి నుంచి టిప్పుసుల్తాన్ గార్డన్ సెంట్రల్ బస్టాండ్, అంబేడ్కర్ సర్కిల్‌ల మీదుగా పాత జిల్లాధికారి కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి ముఖ్యమంత్రికి, విద్యశాఖ మంత్రి పేరున రాసిన వినతి పత్రాలను జిల్లాధికారి కార్యాలయంలో అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా నాగరాజు ప్రైవేటు విద్యసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రైవేటు విద్యాసంస్థలపై ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలు ఇబ్బందులపై చర్చిస్తామన్నారు.

దివ్యాంగుల భత్యం రూ.6వేలకు పెంచాలి

● తమిళనాడు బధిరుల సమాఖ్య డిమాండ్



సమావేశంలో మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే మునుస్వామి తదితరులు

హోసూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, బధిరులకు భత్యాన్ని రూ.6వేలకు పెంచాలని తమిళనాడు బధిరుల రాష్ట్ర సమాఖ్య డిమాండ్ చేసింది. సమాఖ్య 40వ వార్షికోత్సవం, కృష్ణగిరి జిల్లా బధిరుల సంఘం 15వ వార్షికోత్సవం నేపథ్యంలో ఆదివారం హోసూరులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమాఖ్య ఛైర్మన్ సురేశ్‌బాబు అధ్యక్షత వహించారు. అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ, వేపనపల్లి ఎమ్మెల్యే కేపీ మునుసామి, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. వివిధ జిల్లాలనుంచి నిర్వాహకులు, బధిరులు, మూగవారు పాల్గొన్నారు. చెవిటి, మూగవారికి ఇస్తున్న సాయాన్ని రూ.500 నుంచి 1500కు పెంచినట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. చాలామందికి ప్రోత్సాహకాలు అందడం లేదన్నారు. పొరుగు రాష్ట్రాల తరహాలో రూ.6వేలు సాయం అందించాలని కోరారు. దివ్యాంగులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

● నిందితుడి అరెస్ట్

హోసూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని బాగలూరు పోలీసులు అరెస్టు చేశారు. ధర్మపురి జిల్లా అరూర్ ప్రాంతానికి చెందిన శరవణన్ (59)పై బాధితులు స్థానిక బాగలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కృష్ణగిరి జిల్లా కలెక్టర్ వ్యక్తిగత సహాయకుడినని చెప్పుకొంటూ కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్టు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు నేపథ్యంలో శరవణన్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ప్రజలు ఇలాంటి వ్యవహారాలలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచించింది.

నకిలీ కేసులో రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది

రాయచూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నకిలీ దస్తావేజులు సృష్టించి ఆస్తులను కబ్జా చేస్తున్న వ్యవహారానికి సంబంధించి మరొక కేసు నమోదైనట్లు అధికార దవర్గాల ద్వారా తెలుస్తోంది. రాయచూరు తాలూకాలోని శాఖవాది గ్రామానికి చెందిన గూడ్‌సాబ్ 2013 అక్టోబరు 2న చనిపోగా ఇటీవలే ఆయన పేరున ఉన్న ఆస్తి(సర్వే నెంబరు 84)ని నకిలీ ఆధార్ కార్డు ఆధారంగా కొంత మంది వ్యక్తులు జీపీఏ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు సమాచారం. చనిపోయిన గూడ్‌సాబ్ పేరున ఉన్న పొలం ఇప్పటికే ఆయన పేరున విరాసత్ కాకపోగా గూడ్‌సాబ్ ఇప్పటికి బ్రతికి ఉన్నట్లు ఆధార్ కార్డు సృష్టించి ఆయన ఫోర్జరీ సంతకంతో జీపీఏ చేసుకున్నారన్న ఆరోపణల మేరకు పోలీసులు అహ్మద్ సాబ్ అనే వ్యక్తిని అదుపులో తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయంలో నకిలీ దస్తావేజులను సృష్టించిన మరో వ్యక్తిని సహితం ఆదివారం మాన్వి వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారుల పాత్ర ఉన్నట్లు కూడా సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఎనిడ్ మేరి బ్లైటన్ (జయంతి)



ఆంగ్లంలో బాలసాహిత్యంలో పేరొందిన ఎనిడ్ మేరి బ్లైటన్ 1897 ఆగస్టు 11న లండన్‌లో జన్మించారు. ఆమె రచనలు 1930 నుంచి ఇంతవరకు 600 మిలియన్ కాపీలు అమ్ముడయ్యాయి. ఆమె పుస్తకాలు 90 అంతర్జాతీయంగా భాషలలోకి అనువాదం కావడంతో ఎంతో ప్రసిద్ధి చెందారు. విద్య, ఫాంటసీ, మిస్టరీ తదితర అంశాలపై రచనలు చేశారు. ఒక ఏడాదిలో 50 పుస్తకాలు విడుదలయ్యాయి. మ్యాగజైన్‌లు, దినపత్రికలలో రచనలు ప్రచురితమయ్యాయి. 1968 నవంబరు 28న కన్నుమూశారు.

వినాయకరం (పుట్టినరోజు)



పద్మభూషణ్ గ్రహీత తేటకుడి హరిహర వినాయకరం 1942 ఆగస్టు 11న మద్రాస్‌లో జన్మించారు. విక్కు వినాయక్‌రంగా పేరొందారు. ఆయన తండ్రి కళైమామణి పురస్కార గ్రహీత టిఎస్ హరిహరశర్మ సంగీతకారుడు, గురువు. పిన్న వయస్సులోనే ఘటం వాద్యకళాకారుడిగా ప్రతిభ చాటారు. 13వ యేటనే శఠగోపన్ కచేరీలో తొలి ప్రదర్శన చేశారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్, 2016లో ఎంఎస్ సుబ్బులక్ష్మి శతజయంతి అవార్డు అందుకున్నారు. ఎందరో కర్ణాటక సంగీత గాత్ర విద్వాంసులకు సహకారం అందించారు.

దువ్వూరి సుబ్బారావు (పుట్టినరోజు)



రిజర్వుబ్యాంకు గవర్నర్‌గా వ్యవహరించిన దువ్వూరి సుబ్బారావు 1949 ఆగస్టు 11న పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జన్మించారు. అమెరికాలోని ఓహియో విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్ పట్టా పొందిన ఆయన 1972లో సివిల్ సర్వీసెస్ పరీక్షలలో టాపర్‌గా నిలిచారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డి అందుకున్నారు. నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా, ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2008-13 మధ్య రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా వ్యవహరించారు. ఆర్థిక నిపుణుడిగా వివిధ హోదాలలో కొనసాగారు.

రేపటి నుంచి ఆనందోత్సవం

హిందూపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆర్ట్‌ఆఫ్ లివ్వింగ్ ఆధ్వర్యంలో రేపటి నుంచి ఐదు రోజులపాటు ఆనందోత్సవం నిర్వహిస్తున్నట్లు రవిశంకర్ గురూజీ శిష్యబృందం తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 17వరకు ఉదయం 6గంటల నుంచి 8-30గంటలు, సాయంత్రం 6నుంచి రాత్రి 8-30వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌డిజిఎస్‌కళాశాలలోని సెమినార్‌హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆనందం యొక్క బహుళ వ్యక్తీకరణలో భాగంగా సుదర్శన క్రియ యోగాప్రాణాయామం, ధ్యానం, సామూహిక ప్రక్రియలు ఉంటాయన్నారు. దీనివల్ల మానసిక ఒత్తిడి నిర్మూలించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. పాల్గొనేవారు సోమవారం సాయంత్రంలోపు 9347966234కు సంప్రదించాలన్నారు.

నేడు పురంలో తిరంగా ర్యాలీ

సోమవారం హిందూపురంలో జాతీయ జెండాలతో తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి చిన్నమార్కెట్, మెయిన్ బజార్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్‌వరకు ర్యాలీ ఉంటుందన్నారు. పాల్గొనేవారు ప్రతి ఒక్కరూ జాతీయ జెండాలతో ప్రదర్శనగా రావాల్సి ఉంటుందన్నారు.

బాబును గద్దె దించండి: వైసీపీ

సోమందేపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెడుతున్న చంద్రబాబు నాయుడును ప్రజలు గద్దెదించాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బ్రాహ్మణపల్లి, గుడిపల్లి, కావేటి నాగేపల్లి గ్రామాల్లో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అన్ని మతాలను సమానంగా చూడాలి'

హిందూపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేవిధంగా అన్నిమతాలను సమానంగా చూడాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం హిందూపురంలో క్రైస్తవులు ఆగస్టు 10న బ్లాక్‌డేగా పరిగణిస్తూ నిరసన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1950లో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన రెసిడెన్షియల్ ఆర్డర్ మూడో పేరాను వెంటనే రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ డాక్టర్ స్టీఫెన్ రాజ్, సల్మాన్‌రాజ్, అరుణ్‌కుమార్, దేవరాజ్, ఆంజనేయులు, జార్జిబాబు పాల్గొన్నారు.

పురంలో రేపు విద్యుత్ అదాలత్

హిందూపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం హిందూపురంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఈఈ శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూపురం మడకశిర నియోజకవర్గాలతోపాటు పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి మండలాల వినియోగదారులు సమస్యలుంటే తెలుపుకోవచ్చన్నారు. పట్టణంలోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయం వద్ద ఉదయం 11నుంచి 1 గంట వరకు ఉంటుందన్నారు. అదాలత్‌లో సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, మధుకుమార్ పాల్గొంటారన్నారు.

బెంగళూరులో ప్రధాని పర్యటన దృశ్యాలు



ప్రధానికి వర్షంలోనే సీఎస్ శాలిని వీడ్కోలు



ముస్తాబైన వందేభారత్ రైలు



బీజేపీ కార్యకర్తల నినాదాలు



ప్రధానిని స్వాగతిస్తున్న డీజీపీ సలీం



వేదికపై కేంద్ర మంత్రి కుమార, డీసీఎం తదితరులు



ఉత్సాహంగా బీజేపీ నాయకులు

పరిహారంలో పారదర్శకత పాటించాలి

దొమ్మసంద్ర, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఆర్ లేదా బెంగళూరు బిజినెస్ కారిడార్ రోడ్డుకు వెళ్లే 73 గ్రామాల ప్రజలను బీడీఏ అనుసంధాన సూత్రసభలకు ఆహ్వానించిందని, సభలకు రైతులు హాజరై వ్యతిరేకత వ్యక్తం చేయాలని, భూస్వాధీనం చట్టం 2013 ప్రకారం పరిహారం, పునరావాసం కల్పించాలని, సదరు భూములకు ఎన్‌ఓసీ ఇవ్వాలని బీఆర్‌ఆర్ రైతు, స్థలాల సంఘం అధ్యక్షుడు మావళ్ళిపుర బీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సర్జాపుర రోడ్డులోని సూలికుంటె గ్రామంలో జేఎన్‌ఆర్ కన్వెన్షన్‌హాల్‌లో సంఘం సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. బీడీఏ పిలుపునిచ్చిన రాజీ సమావేశాలకు వ్యతిరేకత వ్యక్తం చేయాలని, చట్టపోరాటం మరింత తీవ్రతరం చేయాలన్నారు. గత రెండు నెలలుగా బీడీఏ అధికారులు, కొంతమంది రాజకీయ నాయకులు, రియల్టర్‌లు, దళారులు రైతులను బెదరించి తప్పుడు హామీలతో రాజీకి ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ అంశాలకు సంబంధించి హైకోర్టులో వందలాది కేసులు విచారణలో ఉన్నాయన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు గోవిందరాజ్ మాట్లాడుతూ బిజినెస్ కారిడార్ రోడ్డు నిర్మాణానికి రైతుల నుంచి



సమావేశంలో రైతుసంఘం ప్రముఖులు

ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే కేంద్రప్రభుత్వ కొత్త భూస్వాధీన చట్టం 2013 ప్రకారం పరిహారం ఇవ్వాలని, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం పారదర్శకత పాటించాలని కోరారు. బీఆర్‌ఆర్ పథకం పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్త నోటిఫి కేషన్ ను జారీ చేయాలని, అనంతరమే భూ పరిహారం నిర్ణయించాలన్నారు. సమావేశంలో గౌతమ్‌చంద్ జైన్, ప్రధాన కార్యదర్శి రఘు, కోశాధికారి నరసింహమూర్తి, రైతు నాయకులు సూలికుంటె శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటిలో యల్లమ్మదేవి మూలవిరాట్టు



నీటిలో యల్లమ్మదేవి మూలవిరాట్టు

బెంగళూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లాలో భారీ వర్షాలతో అథణి తాలూకాలోని యల్లమ్మవాడి యల్లమ్మదేవి మూల విరాట్టు సగానికిపైగా మునిగింది. చెరువుపక్కనే ఉన్న ఆలయంలోకి వర్షపునీరు చేరింది. చెరువుకు భారీగా వరదనీరు రావడంతో ప్రమాదస్థాయికి మించి ప్రవహిస్తోంది. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందునే వరదనీరు పోటెత్తుతున్నట్టు స్థానికులు తెలిపారు. ఆలయంలోకి కొంతనీరు ప్రవేశించేసరికి భక్తులను రాకుండా కట్టడి చేశారు. శనివారం రాత్రి మరింత వర్షం కురవడంతో గర్భగుడిలోని మూలవిరాట్టు సగానికి పైగా వర్షపునీటిలో మునిగింది. ముందు జాగ్రత్తగా ఐగళి పోలీసులు బారికేడ్‌లను అమర్చా రు. కేవలం అర్చకులతోపాటు కొంతమంది భక్తులు శ్రావణమాసం పూజా కైంకర్యాలను కొనసాగించారు. పంచామృతాభిషేకం నిర్వహించారు.



ఆలయం చుట్టూ వర్షపునీరు

జేడీఎస్ సభను విజయవంతం చేయండి

విజయపుర, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి అధ్యక్షతన ఈనెల 24న దేవనహళ్ళిలో 'ప్రజలతో జేడీఎస్' పేరిట జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నిసర్గ నారాయణస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం విజయపుర హోబళి భట్రేనహళ్ళి, తిమ్మళ్ళి, గోణూరు, వెంకటగిరికోటె, కోరమంగల, మండిబెలె తదితర గ్రామాలలో పర్యటించి పటేల్ కల్యాణమండపంలో సన్నాహకసభ నిర్వహించారు. డిజిటల్ సభ్యత్వ నమోదు, కార్యకర్తల భారీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. తన అవధిలో ప్రతి గ్రామానికి అభివృద్ధి పనులు చేసినట్టు గుర్తు చేశారు. ప్రస్తుతం రెండేళ్లుగా సాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి బూత్ స్థాయినుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలను



సన్నాహకసభలో మాజీ ఎమ్మెల్యే నిసర్గ నారాయణస్వామి

పార్టీలో చేరేలా ప్రోత్సహించాలన్నారు. పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు, జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు కారహళ్ళి మునేగౌడ, విజయపుర హోబళి జేడీఎస్ కార్యదర్శి కల్యాణకుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ యూనివర్సిటీకి న్యాక్ ఏ గ్రేడ్

బెంగళూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ యూనివర్సిటీకి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ గ్రేడ్ గుర్తింపును ప్రకటించింది. రాష్ట్రంలో న్యాక్ గుర్తింపు పొందిన ప్రతిష్ఠాత్మక విశ్వ విద్యాలయాలలో ఒకటిగా సీఎంఆర్ నిలిచిందని కులపతి డాక్టర్ హెచ్‌బీ రాఘవేంద్ర ప్రకటించారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రానున్న ఐదేళ్లకు న్యాక్ ఏ గ్రేడ్ కొనసాగనుందన్నారు. ఉన్నతవిద్యాసంస్థలలో న్యాక్ ఏడు అంశాలను పరిగణనలోకి తీసుకుని గుర్తింపు ఇస్తుందన్నారు. అకడమిక్, బోధన, నైపుణ్యత, మౌల్యమాపన, పరిశోధనలు, ఆధునిక, విస్తరణ, మౌలిక సదుపాయాలు, నైపుణ్య వనరులు, విద్యార్థుల అకడమిక్ ప్రగతి, సాధన, పాలనా విధానం, నాయకత్వం, నిర్వహణలకు న్యాక్ ఏ క్రోడీకరించి గుర్తింపు ఇచ్చిందన్నారు. ఈ సాధనకు యూనివర్సిటీ పాలకమండలి మనోభావాలు, సమర్థనాయకత్వం, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సిబ్బంది, ప్రతిభావంత పూర్వ, ప్రస్తుత విద్యార్థులు కారకులన్నారు. నైతిక విలువలతో కూడిన శిక్షణ దేశానికి సమర్థవంతమైన వనరు కానుందని సీఎంఆర్ భావిస్తోందన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్ల పంపిణీలో విద్యార్థులు తదితరులు

శిడ్లఘట్ట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రామప్పనహళ్ళిలో అశ్వత్థ నారాయణరెడ్డి, విశ్వ సమృద్ధి యోగా సంస్థకు చెందిన రాజేశ్ గురూజీ, రిషి సాధక సేవా ట్రస్టు సురేశ్ నేతృత్వంలో పేద కుటుంబాలను 25 సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. సుదూర ప్రాంతాలనుంచి నడిచి వచ్చే విద్యార్థులకు అనుకూలం కల్పించేలా కార్యక్రమం నిర్వహించారు. గతవారం ముళబాగిలు తాలూకా యళగొండహళ్ళిలో ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ సమక్షంలో 53 సైకిళ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. మూడో సైకిల్ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గురూజీ మాట్లాడుతూ అశ్వత్థ నారాయణరెడ్డి కుటుంబం వ్యవసాయం, డాక్టర్, లాయర్, ఇంజనీర్, ఆధ్యాత్మికత ఇలా అన్ని రకాలవారు ఉన్నారన్నారు. వీరి సేవలు మరింత పెరగాలని ఆకాంక్షించారు. హైకోర్టు న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 12-13 కేజీల బరువైన పుస్తకాల బ్యాగుతో పిల్లలు వెళ్తున్నట్టు తెలుస్తోందన్నారు. ప్రతిరోజూ సుమారు 4 కిలోమీటర్లు నడిచి వస్తున్నట్టు గుర్తించి వారిని ప్రోత్సహించేలా సాయం చేసేందుకు గురూజీ ముందుకొచ్చినట్టు తెలిపారు. డాక్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. కాగా ఈనెల 19న తిమ్మనాయకనహళ్ళి పంచాయతీలోని 10 గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామస్తులకు భోజన వ్యవస్థ కల్పించారు.

క్రీడాపోటీల్లో రాణించిన విద్యార్థులు

చింతామణి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కైవార హోబళి 2025-26 వార్షిక ప్రాథమిక పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీలలో కైవారకు చెందిన అంబేడ్కర్ బాలుర బృందం ప్రథమస్థానంలో నిలిచి తాలూకాస్థాయికి ఎంపికైంది. కబడ్డీ బృందానికి చెందిన కెప్టెన్ చేతన్, గగన్, భరత్, మనీశ్, శశాంక్, భరత్‌కుమార్, వికాస్, చందన్, అక్షిత్‌కుమార్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. సత్తా చాటుకున్న విద్యార్థుల బృందాన్ని, ఉపాధ్యాయులను పాఠశాల పాలకమండలి, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు

పెనుకొండ రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొండంపల్లి సమీపంలో శెట్టిపల్లికి వెళ్లే అండర్‌బ్రిడ్జి కింద భారీగా వర్షం నీరు చేరింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పెనుకొండ నుంచి పుట్టపర్తికి వెళ్లే కొండంపల్లివద్ద శెట్టిపల్లికి వెళ్లేదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. వచ్చిన వర్షంనీరు బయటకు వెళ్లడానికి దారిలేక నీరంతా బ్రిడ్జికింద చేరుతోంది. నడుంలోతునీరు చేరడంతో ద్విచక్రవాహనాలు సైతం వెళ్లడానికి వీలులేక శెట్టిపల్లి, గాజులపల్లి, నిడిమామిడి, కొట్లపల్లి తదితర పది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



సభలు, సమావేశాలకు
ప్రేక్షకులుగా విద్యార్థులు నిషేధం

▸▸ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశం

బెంగళూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఇకపై ఎటువంటి సభలు, సమావేశాలకు ప్రేక్షకులుగా పంపే విధానానికి నిషేధిస్తూ ప్రాథమిక విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రశ్మిమహేశ్ ఆదేశాలు జారీ చేశారు. సాధారణంగా ప్రజాప్రతినిధులు, రాజకీయనేతలు, ప్రభుత్వేతర సంఘసంస్థలతోపాటు ఇతరత్రా కార్యక్రమాలకు విద్యార్థులను తీసుకెళ్లే సంప్రదాయం ఉండేది. ర్యాలీలు, సభలకు ప్రేక్షకులుగా వెళ్లే విధానాన్ని సంపూర్ణంగా రద్దు చేసినట్టు విద్యాశాఖ కార్యదర్శి రశ్మిమహేశ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదేశాలను ఉల్లంఘించే ఉపాధ్యాయులు, ఇతరత్రా అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల సమయంలో బోధనలు, క్రీడలు తప్ప మరే ఇతర కార్యక్రమాలకు విద్యార్థులు వెళ్లకుండా నిషేధించారు. ఈ నిబంధనలు ఉపాధ్యాయులకు వర్తిస్తాయని ఆదేశాలలో పేర్కొన్నారు. ఈ నిబంధనలు ప్రైవేట్ విద్యాసంస్థలకు అమలు చేయాలని బెంగళూరు దక్షిణ జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం మాజీ అధ్యక్షులు పటేల్ సీ రాజు అధికారులను కోరారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణ వేదికపై భక్తబృందం, నిర్వాహకులు

దొమ్మసంద్ర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సర్జాపుర సోంపురగేట్ సమీపాన గల రాయల్ గ్రాండ్ ప్యాలెస్‌లో శ్రీరామభక్తమండలి, ఆనేకల్ తాలూకా రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాసకల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శ్రీకాళహస్తికి చెందిన వేదపండితులు ఆగమశాస్త్రం ప్రకారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శనివారం సాయంత్రం 6 నుంచి 9 వరకు కార్యక్రమం కొనసాగింది. వేంకటేశ్వరస్వామి గీతాలు, అన్నమయ్య గీతాలు, నాదస్వర డోలు వాదన కల్యాణోత్సవానికి మరింత మెరుగు సంతరించాయి. భక్తులు గోవిందనామస్మరణ నినాదాలు చేస్తూ భక్తిభావంతో కొనసాగారు. కార్యక్రమంలో బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పునీత్‌రెడ్డి, ప్రాయోజకులు సతీశ్, గీతా, రాజేశ్వరి, డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, ట్రినిటీ లలితా పారాయణ బృందం తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ జ్యోతి సద్భావనా యాత్ర



రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్రలో మంత్రి రామలింగారెడ్డి తదితరులు

బొమ్మనహళ్ళి ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జ్యోతి సద్భావనా యాత్ర పెరంబుదూరులో బయల్దేరి స్థానిక కోరమంగల ప్రాంతం ఆడుగూడికి శనివారం రాత్రి చేరింది. రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం ఆడుగూడి చుట్టుపక్కల ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేపీసీసీ కార్యాలయానికి జ్యోతి చేరుకోగా పార్టీ నాయకులు స్వాగతించారు. నెలమంగల, తుమకూరు, చిత్రదుర్గల మీదుగా వివిధ రాష్ట్రాలలో సాగనుంది. తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హరియాణ మీదుగా ఈనెల 19కి ఢిల్లీకి జ్యోతి చేరుకోనుంది. రాజీవ్‌ఘాట్‌కు చేరుకున్నాక యాత్ర పూర్తి కానుంది. ఆడుగూడి మోహన్, శివమూర్తి తదితరులు పాల్గొన్నారు. రాజీవ్‌గాంధీ జ్యోతి యాత్ర కమిటీ అధ్యక్షుడు ఆర్ దొరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రాజీవ్ గాంధీ జ్యోతియాత్రను మూడు దశాబ్దాలకుపైగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. తమ అభిమాన నాయకుడికి ఘన నివాళులు అర్పించడమే ఉద్దేశ్యమన్నారు.